# నాలుగో కోతి

నేను ఆఫీసులోకి ప్రవేశించేసరికి బ్రేక్ యిన్‌స్పెక్టర్ భూపతి సిగరెట్ త్రాగుతూ ఏదో ఫైలు చూసుకుంటున్నాడు.

నన్ను గమనించలేదో, గమనించీ చూడనట్లు వూరుకున్నాడో అర్థం కాలేదు. కాని తల ఎత్తకుండా ఏదో వ్రాసుకుంటున్నాడు.

రెండు నిముషాలు అలాగే నుంచుని సన్నగా దగ్గాను.

ఆయన తల ఎత్తాడు--

"గుడ్‌మార్నింగ్ సార్!" అన్నాను.

"గుడ్‌మార్నింగ్ -- కూర్చోండి" అంటూనే తను చూస్తున్న ఫైలులో మునిగిపోయాడు.

కాసేపాగి "మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తూన్నట్టున్నాను. క్షమించాలి!" అన్నాను.

ఆయన మళ్లీ తల ఎత్తాడు.

"నేను ఒక లారీ క్రొత్తగా కొన్నాను. రిజిస్ట్రేషన్ చేయించి, ఫిట్‌నెస్ టెస్ట్ చేయిద్దామని వచ్చాను. కాగితాలు యిచ్చి మూడు రోజులయింది. మీరు కొంచెం దయవుంచి త్వరగా పని పూర్తిచేస్తే".

ఆయన కొంచెం విసుగ్గా చూశాడు -- "కాగితాలు యిచ్చారుకదా - తొందరపడతారేం -- ఆఫీసు ప్రొసీజర్ ప్రకారం కొంచెం. ఆలస్యం అవుతుంది మరి -- రెండ్రోజులాగి రండి-"

"అదికాదు సార్ -- ఆ లారీ నడవక పోవటంవల్ల నేను రోజూ చాల డబ్బు నష్టపోతున్నాను. మొన్నే లారీని చూసి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిస్తారనుకున్నాను. ఆ రోజు చూడలేదు. నిన్న చూస్తానన్నారు - కాని చూడలేదు. కనీసం యివాళయినా..."

ఇంతలో స్వింగ్ డోర్స్ తెరుచుకుని పొడుగ్గా, బలంగా చామన చాయగా వున్నాయన హుందాగా లోపలకు అడుగుపెట్టాడు.

వస్తూనే నవ్వుతూ, "నమస్తే - భూపతి గారూ!" అన్నాడు.

అంటూనే కుర్చీ ముందుకు లాక్కుని కూర్చున్నాడు.

ఆయన ఎవరో నాకు బాగా తెలుసు. దాదాపు పది బస్సులకు, నాలుగయిదు లారీలకు అధిపతి. పట్టణంలో వున్న గొప్పవాళ్లల్లో ఒకడు. పేరు అంకినీడు.

"ఊరకరారు మహానుభావులు -- ఏదో పెద్ద పని మీదే వచ్చినట్టున్నారే అంకినీడు గారు-" అన్నాడు భూపతి నవ్వుతూ.

"మీతో మాకు వేరే పనేముంటుంది సార్!" అంటూ ఆయనా నవ్వాడు.

భూపతి బల్ల మీద మూడు కోతుల బొమ్మ వుంది. దాని మీద చెడు వినకు, చెడు చూడకు, చెడు చెప్పకు అని వ్రాసి వుంది. బొమ్మ మంచి అందంగానే కాక నీతిదాయకంగా కూడా వుంది.

అది చూస్తూ అన్నాడు అంకినీడు - "గాంధీగారి బొమ్మ పెట్టారే - అయినా ఏం నీతులులెండి ఈ కాలంలో..." అదోరకంగా నవ్వాడు.

భూపతి అన్నాడు - "ప్రజలదేం తప్పు లేదంటాను - చెడు వినద్దు, చూడవద్దు, చెప్పవద్దు అనే మూడు కోతులు చెబుతున్నాయి కాని, చెడు చేయవద్దు అని చెప్పే నాలుగో

కోతి ఏది - అందుకే అందరూ చెడ్డ పనులు చేస్తున్నారు - బాగు పడుతున్నారు".

అంకినీడు పెద్దగా నవ్వాడు - ఆయన హాస్యానికి.

భూపతి తన ముందున్న సిగరెట్ పెట్టెను అంకినీడుకి అందించాడు.

అంకినీడు సిగరెట్ వెలిగించి, నిర్లక్ష్యంగా పొగ వదులుతూ అన్నాడు - "ఒక చిన్న పని తగిలింది సార్ - మన నైన్‌టీన్ ట్వెంటీ నైన్ లేదూ - దానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలి!"

భూపతి పెద్దగా నవ్వాడు.

"ఫిట్‌నెస్సా - ఆ డొక్కు సిటీ బస్సుకా - ఏమన్నా బాగుచేయించారా - యింకా అలాగే నడుస్తున్నదా-"

అంకినీడు కూడా చిన్నగా నవ్వాడు.

"రిపేరా - భలేవాళ్లుసార్ మీరు. దానికి రిపేరు మొదలు పెడితే నాలుగయిదువేల రూపాయలు యిట్టే తినేయదుటండీ - అం - ఏదో రోడ్డు మీద నడుస్తున్నదిగదా - నడవనీయండి - యిప్పుడంత డబ్బు నేనెక్కడ తేను?"-

"మరయితే నేను ఫిట్‌నెస్ ఏలా యిస్తా ననుకున్నారు?" అన్నాడు భూపతి.

అంకినీడు నవ్వాడు.

ఈలోగా భూపతి నా కేసి తిరిగి, "మీ లారీ బయట వున్నదా?" అన్నాడు.

లేచి నిలబడి "వుంది సార్ - చూస్తారా" అన్నాను.

"బయట వుండండి -- కాసేపట్లో వస్తాను!" అన్నాడు భూపతి.

ఒక నమస్కారం పారేసి బయటకు వచ్చాను.

అంతా హడావిడిగా వుంది. ఎంతో మంది చేతిలో రిజిస్ట్రేషన్ పుస్తకాలతోనూ, టోకెన్స్‌తోనూ -- హడావిడిగా తిరుగుతున్నారు. ఒక గంట గడిచింది. నా ఎదురుగానే అంకినీడు కారెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత అరగంటకి భూపతి బయటకు వచ్చాడు. బయట వున్న కొన్ని వెహికిల్స్ అసలు చూడనేలేదు. ప్రక్కనే వున్న డ్రయివర్లతో - "ఫిట్‌నెస్సు అయిపోయింది - బండి తీసుకు వెళ్ళిపోవచ్చు" అని చెప్పాడు. అంటే బండి చూడకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తయారయి పోయిందన్నమాట. కొన్ని వెహికెల్స్ కేవో వంకలు పెట్టాడు.

"మీ లారీ ఏది?" అడిగాడు బ్రేక్ యిన్‌స్పెక్టర్.

చూపించాను. ఎక్కి స్టార్టు చేసాడు, స్టార్టు అయింది. కొంచెం ముందుకూ వెనక్కూ రెండు మూడు సార్లు నడిపాడు. సడన్‌గా బ్రేక్ కొట్టాడు. ఠక్కున ఆగింది. క్రిందకు దిగి నంబర్ ప్లేట్లూ అవీ చెక్ చేశాడు. నన్ను పిలిచి - స్టాప్ బోర్డు సరిగ్గా వ్రాయంచలేదన్నాడు. అది చాల ముఖ్యం అన్నాడు. స్టాప్ బోర్డు లైటు కూడా సరిగ్గా లేదన్నాడు. బ్రేకు గట్టిగా పట్టుకుంటున్నదిట. అది బాగు చేయించాలన్నాడు. రియర్ వ్యూ అద్దం మరీ చిన్నదయింది - సరిగ్గా కనపడటంలేదు - పెద్దది వేయించమన్నాడు.

అన్నిటికీ సరేనన్నాను.

"అన్నీ బాగుచేయించి-రేపూ ఎల్లుండీ శెలవు కనుక - సోమవారం తీసుకురండి - అప్పుడు చూద్దాం - ఇటువంటి బళ్ళకి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కావాలని ప్రాణం తీస్తారు!" సణుగుతూ లోపలకు వెళ్ళి పోయాడాయన.

కాసేపు నాకేం చేయాలో తెలియలేదు.

చుట్టు కాలుస్తూ బయట నుంచున్న ప్యూన్ నన్ను చూసి అదోలా నవ్వాడు. చుట్ట పారేసి మెల్లగా నా దగ్గరకు వచ్చాడు.

'ఏం సార్ - పనయిందా! అయ్యగారు ఏమన్నారు - మీ ముఖం చూస్తే తెలియటం లేదా సార్ పనయిందో లేదో - మీరు నే చెపితే వినరు సార్ - మీరు 'ఊఁ!' అనండి - అయిదు నిమిషాల్లో మీ పని పూర్తిచేయకపోతే నన్నండి - ఇప్పుడు వచ్చిన అంకినీడు గారు చూడండి. ఆయన డొక్కు బస్సుని యిక్కడకు తేకుండానే - అయ్యగారు చూడకుండానే సర్టిఫికేట్ సంపాదించుకున్నారు - చూశారా. ఆయనగారు వచ్చారంటే వెంటనే పని చేయించుకు పోతారు. ఆయనకూ మాకూ కూడా హాయి. మీరు యిన్నాళ్ల నుంచీ తిరుగుతూ..."

అతని మాటలు వినకుండా ముందుకు నడిచాను. అక్కడ పని అవాలంటే ఏం చేయాలో కూడా తెలుసు. అంత అమాయకుడినేం కాదు. కానీ నా ఆశయాలకు అది విరుద్ధం.

ఇన్ని రోజుల నుంచీ నా లారీ నడవక పోవటం వల్ల నష్టం నా మదిలో మెదిలింది. 'ఏం డబ్బు యిస్తే పని త్వరగా అవుతుంది గదా' అని అడుగుతున్నాడు నాలోని మనిషి. మళ్ళీ ప్రిన్స్‌పల్ అడ్డం వచ్చింది. అందుకే ప్యూన్‌తో ఏమీ అనకుండా బయటకు వచ్చాను.

వెనక అతను సణగటం వినబడుతూనే వుంది.

మూడు రోజుల తర్వాత ఆయన చెప్పిన 'రిపేర్లు' చేయించి మళ్లీ వచ్చాను.

అదేం ఖర్మమో కాని నేను భూపతి దగ్గరకు వెళ్లిన మరుక్షణంలోనే - లోపలకు హడావిడిగా వచ్చాడు అంకినీడు. మనిషి కొంచెం గాభరాగా వున్నాడు.

కుర్చీ లాక్కుని కూర్చుని - దీనంగా చూశాడు భూపతి వేపు.

భూపతి వింతగా చూశాడతన్ని.

"కొంపలంటుకున్నాయి సార్ - మా బస్సుకి ఏక్సిడెంటు అయింది!" - నుదుటికి పట్టిన చెమటను, చేతి రుమాలుతో తుడుచుకున్నాడు.

భూపతి ఆసక్తిగా చూశాడు - "ఏ బస్సుకి" అడిగాడు.

"మొన్న మీరు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిచ్చిందే - నైన్‌టీన్ ట్వంటీ నైన్..."

భూపతి కొంచెం కలవరపడ్డట్టు కనిపించాడు. మెల్లగా అన్నాడు - "ఏక్సిడెంట్ ఎలా అయింది?"

అంకినీడు నాలికతో, ఎండిన పెదవులు ఒక్కసారి తుడుచుకుని అన్నాడు - "ఏం లేదు సార్ - మెయిన్ రోడ్డు మీద సెంటర్‌లో మా సిటీ బస్సు వెడుతన్నదట. రూల్స్ ప్రకారం ఎడమ ప్రక్కనే వెడుతున్నాడు. సడన్‌గా గేదె ఒకటి అడ్డం వచ్చిందిట. బ్రేక్ కొడితే పడలేదు. గేదె మీదకు బస్సు ఎక్కుతుందేమోనని, చటుక్కున కుడి ప్రక్కకు త్రిప్పాడుట బస్సుని. ఆ స్పీడుకి, బస్సు - అలా చటుక్కున త్రిప్పటంతో, కంట్రోల్ తప్పి - కుడి ప్రక్కన వున్న సిటీ బస్సు స్టాపులోకి దూసుకు పోయిందిట. అక్కడా మళ్లీ బ్రేక్ కొట్టినా పడలేదు. బస్టాపులో బస్సు కోసం నుంచున్న నలుగురు స్కూలుకు వెళ్లే అమ్మాయిల మీద ఎక్కి తర్వాత గోడకు గుద్దుకొని ఆగిందంట..." అంకినీడు ఆగాడు.

"ఆ నలుగురు చిన్న పిల్లలకూ దెబ్బలు తగల్లేదు కదా -" అడిగాడు కంగారుగా.

అంకినీడు ఒక క్షణం మాట్లాడలేదు. కాసేపటికి అన్నాడు - "అంత వేగంగా వెడుతున్న బస్సు పసి పిల్లల మీద ఎక్కితే దెబ్బలు తగిలినయ్యా అంటారేమిటి సార్ - నలుగురు అమ్మాయిలూ బస్సు క్రింద పడి నలిగిపోయారు - వెంటనే ప్రాణంపోయింది".

నాకు నోట మాట రాలేదు. హృదయంలో ఏదో కలుక్కుమంది.

"మరి పోలీసులు కేసు బుక్ చేయలేదా?" అడిగాడు భూపతి.

"చేశారు - కాని మా బావమరిది ట్రాఫిక్ యిన్‌స్పెక్టర్‌ని ఈ పాటికి కలుసుకునే వుంటాడు. ఎంతడిగినా సరే యిచ్చేయమని చెప్పాను. అతను మేనేజ్ చేయగలడు సార్ - అక్కడేం పరవాలేదు..."

భూపతి ఏం మాట్లాడలేదు.

"వాళ్ల రిపోర్టుతోపాటు బ్రేకులు పని చేస్తున్నాయనీ, బస్సు కండిషన్‌లోనే వుందనీ మీరు సర్టిఫికేట్ యిస్తే - ఈ కేసును మాపు చేయవచ్చు. దయచేసి మీరు..."

వాళ్ళ మాటలు వినపడుతున్నా నాకు మనసులో ఏదో భారంగా వుంది. మా అమ్మాయి స్కూలుకి వెళ్లే సమయం సరిగ్గా అదే. కొంపతీసి ఈ బస్సు పొట్టన పెట్టుకున్న నలుగురు పాపలలో మా అమ్మాయి వుందా? - ఏదో వణుకు ప్రారంభమయింది. తక్కున లేచి - చక చకా మెయిన్ రోడ్డు సెంటర్ వేపు బయల్దేరాను.

నడుస్తున్నానే కాని నా ఆలోచనలు చాల వెర్రిగా, పిచ్చి పిచ్చిగా వున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి.

సెంటర్‌లో చాలా మంది జనం గుంపుగా వున్నారు. పోలీసులూ వున్నారు. కంగారును అణుచుకుంటూ, జనాన్ని ప్రక్కకు తోసి - లోపలికి వెళ్లాను. గుండె వేగంగా కొట్టుకుంది. ఆ దృశ్యాన్ని చూడలేకపోయాను. కళ్ళు మూసుకున్నాను. ఒక ప్రక్క ఆ చనిపోయిన వారిలో మా అమ్మాయి లేదన్న ఆనందం వున్నా - ఆ హృదయ విదారక దృశ్యం చూసి మనసంతా

వికలమయి పోయింది. కళ్ళల్లోకి నీళ్లు వచ్చినయి. ఒక క్షణం ఆగి కళ్ళు తెరిచాను.

బస్సు ముందు చక్రాల క్రింద నలుగురు పసి పాపలూ నలిగి పోయారు. ముఖాలు కొంచెం గుర్తు తెలుస్తున్నా ఆ లేత శరీరాలు పచ్చడి అయిపోయాయి. నెత్తురు మడుగులో నిశ్చలంగా పడి వున్నాయి. ఆ నలుగురూ పది సంవత్సరాల లోపువారే. పదేళ్ళ లోపలే వాళ్ళకి నూరేళ్ళు నిండి పోయాయి. మృత్యువు వాళ్ళని జయించింది, కబళించింది - అంతకన్నా అమాయకులు దొరకలేదేమో.

ఇంతలో హఠాత్తుగా గుర్తుకు వచ్చింది - ఆ అమాయకపు పిల్లల చావుకు కారణమెవరో, ఏమిటో. ఈ లోపలే అంకినీడు భూపతికి కొన్ని పచ్చ కాగితాలు అందించే వుంటాడు. ఆయన బస్సు కండీషన్‌లోనే వుందని సర్టిఫికేట్ యిస్తాడు. అంకినీడు బావమరిది పోలీసుల దగ్గర మేనేజ్ చేస్తాడు. అందరూ కలసి - బస్సువాళ్లదేం తప్పు లేదని - ఏదో కారణం చూపిస్తారు. అంతటితో ఈ కేసు కొట్టివేయబడుతుంది. అంకినీడు ఒకసారి జేబు తడుముకుని, హాయిగా వూపిరి పీల్చుకుంటాడు. భూపతి ఆదాయం పెరుగుతుంది. అతను ఆ డబ్బు ఆనందంగా ఖర్చు పెట్టుకుంటాడు. కాని అతను ఖర్చుపెట్టే ప్రతి పైసాకీ నాలుగు ప్రాణాలను జమకట్టు కున్నాడు. నాలుగు పసి, అమాయక ప్రాణాలను బలి చేస్తున్నారంతా కలసి -దేనికోసం - డబ్బు కోసం, కేవలం డబ్బు కోసం.

నా ఆలోచనలకు అంతరాయం కలిగింది, కారు హారన్ వినగానే. అంకినీడూ, భూపతీ వచ్చారు గబగబా. అంకినీడు, భూపతికి చూపించాడు ప్రమాదం జరిగిన చోటును.

భూపతి బస్సు నుంచున్న తీరునీ, ఆ పసి పాపల్నీ చూశాడు. ఉలిక్కిపడి మళ్లీ చూశాడా పాపల్ని. కొయ్య బారిపోయాడు. అంకినీడు ఏదో అంటున్నా అతనికి వినపడటం లేదు. ఒక క్షణం తర్వాత తేరుకుని - గబగబా ముందుకు వెళ్లాడు. ఆ నలుగురు పాపల్లోనూ మధ్యన - బస్సు క్రింద నలిగి ప్రాణాలను పోగొట్టుకున్న ఎర్రటి, అందమైన పాప తల మీద చేయి వేశాడు. ప్రేమగా చూశాడు. ఒక్కసారిగా 'సుజాతా!' అని పెద్దగా అరచి, ఆ అమ్మాయి మీద పడి విలపించాడు - బ్రేక్ యిన్‌స్పెక్టరు భూపతి.

నాకేం అర్థం కాలేదు.

ఎవరో అంటున్నారు - "ఆ అమ్మాయి బ్రేక్ యిన్‌స్పెక్టరుగారి అమ్మాయా - అరే ... పాపం... ఆయనకు ఒక్కతే కూతురు. కాన్పు అప్పుడు ఆపరేషన్ చేసి ఆ అమ్మాయిని బయటకుతీసి, ఆయన భార్యకు యిక మళ్లా పిల్లలు పుట్టరని చెప్పారుట డాక్టర్లు. అందుకని పాపం - ఈ అమ్మాయిని చాలా అపురూపంగా, గారాబంగా, కంటికి రెప్పలా...."

నాకు తర్వాత మాటలు వినపడలేదు. బయటకు వచ్చేశాను.

అక్కడవున్న వేపచెట్టు మీద నాలుగు కోతులు గంతులు వేస్తున్నాయి. ✿